ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 28 అక్టోబరు 2025



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

30న రైల్వే డీఆర్ఎం పర్యటన

పెద్దపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణ ఈ నెల 30వ తేదీన పెద్దపల్లి నుంచి నిజామాబాద్ వరకు గల రైల్వే లైన్‌లో పలు స్టేషన్లను తనిఖీ చేయనున్నారు. ఆయన ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలు దేరి 9.45 గంటలకు పెద్దపల్లికి చేరుకోను న్నారు. ఇక్కడి నుంచి 10 గంటలకు నిజామాబాద్ బయలుదేరనున్నారు. మధ్యలో ఉన్న స్టేషన్లు, యార్డులు, క్రాసింగ్ స్టేషన్లు, గూడ్స్ షెడ్స్, బాలస్ట్ డిపోలు, ఆర్‌ఓబీలు, ఆర్‌పీఎఫ్ బ్యారక్ లను పరిశీలించనున్నారు. సాయంత్రం 4.45 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనున్నారని రైల్వే వర్గాలు తెలిపాయి.

పత్తి క్వింటాల్‌కు ధర రూ.7017

పెద్దపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం క్వింటాలు పత్తికి గరిష్ఠంగా 7,017 రూపాయల ధర పలికింది. మార్కెట్ కు 472 మంది రైతులు 1415 సంచుల్లో 1273.05 క్వింటాళ్ల పత్తిని తీసుకవచ్చారు. కనిష్ఠంగా 5,501 రూపాయలు, మోడల్ ధర 6,750 రూపాయలు పలికింది. పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందనే కారణంతో వ్యాపారులు మద్దతు ధర చెల్లించలేదు. మద్దతు కంటే వెయ్యి రూపాయలు తక్కువ కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులేవీ!

- రెండేళ్లుగా సీడీపీ నిధులు కేటాయించని ప్రభుత్వం
- పథకం అమలుపై అనుమానాలు
- నిధులు లేక ఇబ్బందులు పడుతున్న ఎమ్మెల్యేలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కోసం యేటా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. వివిధ కార్యక్ర మాల్లో భాగంగా గ్రామాలు, పట్టణాలకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తుల మేరకు పనులు చేసేందుకు హామీలు ఇస్తుంటారు. ఆ హామీలను సీడీపీ ద్వారా వచ్చే నిధులతో నెరవేరుస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) పథకం ఉమ్మడి రాష్ట్రంలో మొదలయ్యింది. ఈ పథకం ద్వారా ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలకు కూడా నిధులు కేటాయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా యేటా నియోజకవర్గాలకు ఆయా ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తూ వచ్చాయి. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా కూడా ఇప్పటి వరకు 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సీడీపీ కింద నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. దీంతో సీడీపీ పథకం అమలులో ఉందా, లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీడీపీ నిధుల కేటాయింపు లేకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో 5 లక్షల రూపాయలలోపు చిన్న చిన్న పనులు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ కూడా రెండేళ్లుగా నిధులను నిలిపి వేసిన ఉదంతాలు లేవు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే పథకం అమలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటి నుంచి సీడీపీ అమల్లో ఉంది. మొదట ఈ పథకం ద్వారా యేటా రూ.50 లక్షలు ఇవ్వగా, తర్వాత రూ.75 లక్షలకు, అనంతరం కోటి 50 లక్షలకు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి 50 లక్షల రూపాయలు ఉన్న సీడీపీ నిధులను 3 కోట్ల రూపాయలకు పెంచారు. ఆ తర్వాత 2018 నుంచి 5 కోట్ల రూపాయలకు పెంచారు. గత ఏడాది నవంబరు చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) ద్వారా 10 కోట్ల రూపాయల చొప్పున కేటాయిం చారు. ఇందులో తాగునీటి అవసరాల కోసం కోటి, పాఠశాలల్లో మౌలిక వసతులకు 2 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతుల కోసం 50 లక్షలు, మిగతా 6 కోట్ల 50 లక్షల రూపాయలను ఇతరత్రా అభివృద్ధి పనులకు వెచ్చించాలని పేర్కొన్నారు. ఈ పనులన్నింటికీ ఇన్‌చార్జీ మంత్రి ఆమోదం ఉండాలని పేర్కొన్నారు.

రెండేళ్లుగా కేటాయింపులు లేవు..

ఎస్‌డీఎఫ్ కింద నియోజకవర్గాలకు నిధులు కేటాయించిన ప్రభుత్వం రెండేళ్లుగా సీడీపీ కింద నిధులు కేటాయించడం లేదు. యేటా ఏప్రిల్‌లో సీడీపీ నిధులను కేటాయిస్తారు. మూడు, నాలుగు విడతల్లో డబ్బులను విడుదల చేస్తారు. గతేడాది ఏప్రిల్ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉంది. ఆ తర్వాత కూడా నిధులను ప్రకటించక పోగా, జూలై 25న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సీడీపీ కోసం నిధుల కేటాయింపు లేకపోవడం గమనార్హం. కనీసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో నైనా సీడీపీ కింద నిధులు కేటాయిస్తారని, గతంలో కంటే ఎక్కువ నిధులు పెంచి ఇస్తారని ఎమ్మెల్యేలు ఆశించారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ పథకం ఊసెత్తడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపొందిన ఎమ్మెల్యేలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. గ్రామాల్లో మురికి కాలువలు, సీసీ రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి పనులు, కమ్యూనిటీ హాళ్లు, విద్యుదీకరణ పనులకు సీడీపీ నిధులు ఉపయోగ పడతాయి. ఆ నిధులు ఎమ్మెల్యేలకు ధైర్యాన్నిస్తాయి. కానీ నిధులు కేటాయించక పోవడంతో పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న పనులు జరగకుండా పోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలను ఎస్‌డీఎఫ్ కింద కేటాయిస్తే, ఈ

(మిగతా 8వ పేజీలో)

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు

పెద్దపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన దార సతీష్ అదనపు కలెక్టర్ డి వేణుకు విజ్ఞప్తి చేశారు. అయన తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన మావోయిస్టు మంథని లక్ష్మీ అలియాస్ సంధ్యకు పునరావాసం కింద గ్రామశివారు సర్వే నెంబర్ 309లో 5 ఎకరాల భూమి కేటాయించి పట్టా ఇప్పించాలని దరఖాస్తు చేసుకొన్నారు. ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు రాశారు. తన బాగోగులు పట్టించుకోకుండా ఇంటిలో నుంచి గెంటేసిన కుమారుడు శ్రీధర్‌పై తల్లిదండ్రులు, వృద్ధులు పోషణ సంక్షేమ చట్టం కింద చర్యలు తీసుకొని ఇల్లు ఇప్పించాలని రామగుండం మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన భోజరాజు దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ చర్యలు చేపట్టాలన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కమాన్ వాడకు చెందిన వేణుమాధవ్ కమర్షియల్ ఏరియా వెనుక చిత్తడిగా ఉందని, పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయని, శుభ్రం చేయించాలని దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్‌కు రాశారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణు జిల్లా అధికారులను ఆదేశించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

డీపీవో వీరబుచ్చయ్య



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. పెద్దరాత్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంపీఓ ఆరీఫ్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజం కోసం పోరాడాలి



ముగ్గులను పరిశీలిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి స్వప్నారాణి

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు సంఘటితంగా పోరాటం చేయాలని, భవిష్యత్ తరాలకు డ్రగ్స్ మహమ్మారి నుంచి విముక్తి కలిగించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (డీఎల్ఎస్ఏ) స్వప్నారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా నశాముక్త్ భారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు డ్రగ్స్ మూలంగా సమాజంలో కోల్పోతున్న జీవితాలకు అద్దం పట్టేవిధంగా వేసిన రంగవల్లులు అలరించాయి. సీనియర్ సివిల్ జడ్జి (డీఎల్ఎస్ఏ) స్వప్నారాణి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన చేసుకోవాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై సూచించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పుడు సెల్ యుగం నడుస్తుందని ఇంటర్నెట్‌తో లాభ నష్టాలను వివరించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు ఆక ర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, భావితరాలకు మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. అనంతరం ముగ్గులను పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు. జనరల్ స్పెషలిస్టు సుచరిత మెప్మా ఇన్‌చార్జీ టీఎంసీ స్వప్న పాల్గొన్నారు.

నేడు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

సుల్తానాబాద్/ధర్మారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతు వేదికల్లో మంగళవారం రైతునేస్తం కార్యక్రమానికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పైడితల్లి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు, మార్కెటింగ్‌శాఖ ప్రతినిధులు పాల్గొని పత్తి, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. కనుకుల, రేగడిమద్దికుంట, కాట్నపల్లి రైతు వేదికల్లో హాజరు కావాలని సూచించారు.

ధర్మారం మండలంలోని బొట్లవనపర్తి, ధర్మారం, కటికెనపల్లి గ్రామాల్లోని రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటలో తెలిపారు.

ముగిసిన మద్యం టెండర్లు

- 74 షాపులకు లైసెన్స్‌దారుల ఎంపిక
- డ్రా తీసిన అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ
- మహిళలకు దక్కిన 15 షాపులు



మద్యం షాపుల కోసం డ్రా తీసిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ, హాజరైన వ్యాపారులు

పెద్దపల్లి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ ముగిసింది. 74 ఏ4 షాపులకు 1507 దరఖాస్తులు రాగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ డ్రా ద్వారా లైసెన్స్ దారులను ఎంపిక చేశారు. ఈ టెండర్లలో 15 మద్యం షాపులను మహిళలు దక్కించుకొన్నారు. రెండేళ్లకు గాను మద్యం లైసెన్సుల ద్వారా 86 కోట్ల 60 లక్షలు, దరఖాస్తుల రూపేణా 45 కోట్ల 21 లక్షలు, మొత్తం 131 కోట్ల 81 లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరనున్నది. జనాభా ప్రాతిపదికన స్లాబ్‌ల ప్రకారం ఫీజు వసూలు చేయనున్నారు. 12 షాపులు 50 లక్షలు, 24 షాపులు 55 లక్షలు, 12 షాపులు 60 లక్షలు, 26 షాపులు 65 లక్షలు వార్షిక ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సోమవారం పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బంధంపల్లిలో గల స్వరూప గార్డెన్‌లో డ్రా ద్వారా మద్యం షాపులను ఖరారు చేశారు. పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని 20 షాపులకు 442, సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని 15 షాపులకు 305, రామగుండం సర్కిల్ పరిధిలోని 24 షాపులకు 474, మంథని సర్కిల్ పరిధిలోని 15 షాపులకు 286 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో షాపు వారీగా దరఖాస్తుల సంఖ్యను బట్టి టోకెన్లను వ్యాపారులకు చూపెట్టి డబ్బాలో వేసి టోకెన్ తీసి లైసెన్స్‌దారులను ఎంపిక చేశారు. ఫొటో, వీడియో చిత్రీకరణ నిర్వహించారు. షాపులు దక్కిన వారు కేరింతలు కొట్టగా, దక్కని వాళ్లు నిరాశకు గురయ్యారు. 74 షాపుల్లో 15 షాపులు మహిళలకు, 59 షాపులు పురుషులకు దక్కాయి. డ్రా అనంతరం మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ఎక్సైజ్ ట్యాక్స్ వార్షిక పన్నులో 6వ వంతు చెల్లించి లెటర్ తీసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ నుంచి 2027 నవంబర్ 30వ వరకు కొత్త షాపులు అమల్లో ఉంటాయన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, దరఖాస్తు దారులు, ఎక్సైజ్ శాఖ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన





ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, విద్యార్థులకు వివరిస్తున్న సీపీ

కోల్‌సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోలీసు శాఖ విధులపై అవగాహన కలిగి ఉండాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ విధులపై ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు కేవలం నేరస్తులను పట్టుకోవడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలు, చట్టపరమైన అవగాహన పెంపునకు నిరంతరం కృషి చేస్తారన్నారు. ప్రజల రక్షణ, మహిళా భద్రత, నేరాల నియంత్రణకు పని చేస్తుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చునని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటూ చెల్లించకపోవడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడానికి, వారి రక్షణ గురించి షీటీం పనిచేస్తుందన్నారు. వెయ్యి మంది విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నారు. పోలీస్‌విధులు, కమ్యూనికేషన్ సిస్టం, ఫింగర్ ప్రింట్‌డివైజ్‌ల వల్ల ఉపయోగాల గురించి, బీడీ టీమ్ ఎక్విప్‌మెంట్, డాగ్ స్క్వాడ్, రోడ్డు ప్రమాదాల స్పీడ్‌లేజర్‌గన్, తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న స్నిఫర్ డాగ్ ప్రదర్శన

పోలీస్ అధికారులు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై స్నిఫర్ డాగ్ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకున్నది. డాగ్స్ చేసిన ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. బాంబ్ స్క్వాడ్ ప్రదర్శన, నేరస్తులను పట్టుకోవడంలో డాగ్స్ చేస్తున్న కృషిని తిలకించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్ కుమార్, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

విమర్శించే వారికి మా పనితీరు, అభివృద్ధే జవాబు
రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్
8

పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

పెద్దపల్లి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ కే రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాబోయే 2 రోజులపాటు రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాల్లో వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాల వల్ల నష్టం వాటిల్లకుండా కలెక్టర్‌లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం కేంద్రాలను ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తూర్పు తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట కోతలు వాయిదా వేయాలన్నారు. సీఎస్ కె రామ కృష్ణా రావు మాట్లాడుతూ ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం మద్దతు ధర అందించి కొనుగోలు చేస్తుందని అన్నారు. 45 రోజుల నుంచి 2 నెలల్లో ధాన్యం కొనుగోలు ఉధృతంగా జరుగనుందని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ముప్పిడి శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఓ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం కాళిందిని, ఆర్‌టీఓ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్న సాహిత్య
ఖేలో ఇండియా విభాగంలో గోల్డ్‌మెడల్
జాతీయ స్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ
7



మహిళ అదృశ్యం.. కేసు నమోదు


దేశ్పాల్ శోభ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ మండలం, ఉప్పర పల్లి గ్రామానికి చెందిన దేశ్పాల్ శోభ నాలుగు రోజులక్రితం తన చిన్నకూతురుకు వద్దకు వచ్చి అదృశ్యం అయింది. ఈ మేరకు కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయిన తన చిన్న కూతురు చూడడానికి శోభ వచ్చింది. సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పట్టణంతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శోభ పెద్ద కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ కరుణాకర్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712670773, 8712574726 నంబర్లకు సమా చారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగుల మల్యాల శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో నాగులమల్యాలకు చెందిన చేకూరి సతీష్(30) మృతిచెందాడు. కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. నాగుల మల్యాలకు చెందిన సతీష్ గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని బావుపేటనుంచి బైక్‌పై ఇంటికివస్తున్న క్రమంలో నాగుల మల్యాల శివారులోని మూలమలుపు వద్ద బైక్‌అదుపుతప్పి చెట్టును ఢీకొం ది. దీంతో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదిలో భద్రపరిచారు.

కార్మికుల పిల్లలకు కేంద్రం చేయూత



- ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్
- పోస్టుమెట్రిక్ దరఖాస్తులకు 31 వరకు గడువు

చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పిల్లల విద్య కోసం కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోంది. 1వ తరగతి నుంచి బీటెక్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను. వెయ్యి రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు అందజేస్తోంది. పోస్టుమెట్రిక్‌కు సంబంధించిన ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఏఎంఎస్, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తును చేసుకోవాలి.

● బీడి కార్మికులు, ఐవోఎంసీ, ఎల్‌ఎస్‌డీఎం కార్మిక కుటుంబాలకు చేయూత..

బీడి కార్మికుల పిల్లలతోపాటు ఐరన్ ఓర్, మాంగనీస్ ఓర్, లైంస్టోన్ మైన్స్, డోలోమైట్, మైకా మైన్స్, సినీ కార్మికుల కుటుంబాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. 1వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు వెయ్యి నుంచి 25 వేల రూపాయల వరకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నేరుగా విద్యార్థుల ఖాతాలకే నగదును బదిలీ చేస్తారు.

● దరఖాస్తు.. అర్హతలు..

విద్యార్థులు ఎన్‌ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో రెగ్యులర్ పద్ధతిలో పాసై ఉండాలి. సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులు అనర్హులు. దూర విద్యను అభ్యసించే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. ఈ నెల 31 లోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులకు 3 వేల రూపాయలు, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు 6 వేలు, బీటెక్, ఎంబీబీఎస్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ఏడాదికి 25 వేల రూపాయల ఉపకార వేతనం అందుతుంది. ప్రభుత్వ అనుమతి ఉన్న కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు. బీడి కార్మికులు, మైన్ కార్మికుల వేతనం 10 వేలలోపు ఉండాలి. సినీ కార్మికుల వేతనం నెలకు ఎనిమిది వేల రూపాయలు ఉండాలి. కార్మికుల గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత మెమో, తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

నా కొడుకు మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలి

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు ఆత్మహత్య చేసు కోవటానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీకి చెందిన శీలం రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో కోరా రు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవటానికి కారణమైన వారిపై మంథని పోలీసులకు ఫిర్యాదుచేసి నెలలుగడిచినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలే దని వాపోయారు. శ్రీపాదకాలనీలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2024 డిసెంబర్ 6న జరిగిన గొడవ నేపథ్యంలో తన కొడుకు పై ఫిర్యాదు మేరకు మంథని ఎస్‌ఐ రమేష్ కొట్టడంతో అవమానభారంతో డిసెంబర్ 8న ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. తాము గమ నించి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా 2025 సెప్టెంబరు 19న రాజ్‌కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. రాజ్‌కుమార్ మృతికి పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండా పాపారావు, మూల పురుషోత్తంరెడ్డిల ఒత్తిడేకారణమని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్య లు తీసుకొని న్యాయంచేయాలని ఆమెపోలీసు ఉన్నతాధికారులను కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి తండ్రీ, కొడుకుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటుపాఠశాల నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి ఐదేళ్ల వయసు ఉన్న విద్యార్థి ప్రణయ్, తండ్రి రాజు సోమవారం పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడిపోయారు. విద్యార్థి, తండ్రికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామంలోని రాజు కొడుకు ప్రణయ్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. కొడుకు తీసుకుని బైక్‌పై వెళ్తున్న రాజు ఎదురుగా బస్సు రావడంతో రోడ్డు పక్కన ఆగాడు. కాలు కింద పెట్టడడం వల్ల అదుపు తప్పి మురుగు నీటి కాల్వలో పడిపోయారు. గమనించిన వాహనదారులు కాల్వలోని తండ్రీకొడుకులను బయటకు తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వెండి నాణేలపై అధికారుల విచారణ


వెండి నాణేలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జూలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో వెండి నాణె ములు లభ్యమైనట్లు రెవెన్యూ పోలీసు అధికారులు తెలిపారు. చీమలపేట గ్రామానికి చెందిన తొంటి రాజు పాతఇంటిని బ్లేడ్ ట్రాక్టర్‌తో సహాయంతో చదును చేస్తుండగా 10వెండి నాణె ములు లభ్యమైనట్లు అధికా రులు పేర్కొన్నారు. సోమ వారం గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు వాటిని స్వాధీనం చేసు కున్నారు. ఈ నాణెములు 1925సంవత్సరం నిజాంప్రభుత్వ పాలనలో ముద్రించినట్లు ఆధారాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, గిర్దావర్ భవానిప్రసాద్, పోలీసులు అజీమ్ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఎస్‌యూ స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాత వాహన విశ్వవిద్యాలయం లో వచ్చేనెల7న నిర్వహిం చనున్న 2వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు యూని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆహ్వాన పత్రిక అందజే శారు. సోమవారం హైదరా బాద్‌లో గవర్నర్‌ను కలి శారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని పనులూ దాదాపు పూర్త వుతున్నాయని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియం త్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): పాతకక్షల నేపథ్యంలో హత్యచేసిన నిందితుడు మహేష్‌కు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయ మూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. జగి త్యాల పట్టణం హనుమాన్‌వాడకు చెందిన తోటశేఖర్, బీట్‌బజార్ చెందిన సామాండ్ల మహేష్‌కు పాతగొడవలు ఉండేవి. ఈ నేప థ్యంలో 2023అక్టోబరు 16న శేఖర్‌కు అతిగా మద్యం తాగించి మహేష్ కత్తితో పొడిచి హత్యచేశాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు జగిత్యాలటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సాక్షు లను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పీపీ మల్లికార్జున్, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఇన్స్‌పెక్టర్ కిషోర్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి దూషించిన కేసులో నిందితుడైన ప్రశాం త్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4,200 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్ లావణ్య తీర్పు వెలువరించారు. జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి లక్ష్మణ్‌ను 2022 నవంబర్ 13న ప్రశాంత్ అనేవ్యక్తి మద్యం మత్తులో దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగిత్యాలరూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఏపీపీ, కోర్టుడ్యూటి అధికారు లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన ఏపీపీ రాజేష్, ఎస్సై అనిల్, సీడీవో నాగరాజు, సీఎంఎస్ ఎస్సైని ఎస్పీ అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

● బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు

జగిత్యాల టౌన్, అక్టోబర్, 27 (ఆంధ్రజ్యోతి): మైనర్‌బాలికపై అత్యాచారం కేసులో నింది తుడికి 20ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.10 వేల జరిమానాతోపాటు బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పుచెప్పారు. 2023లో కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌పరిధిలో కట్కూరిఅశోక్ అనేనిందితుడు బాలికను అత్యాచారంచేసిన ఘటనలో పోక్సో చట్టం కిందకేసు నమోదుచేశారు. అప్పటి ఇన్స్పెక్టర్లు కృష్ణకుమార్, కిషోర్ రమణమూర్తి కేసు విచారణచేసి ఫాస్ట్ ట్రాక్‌స్పెషల్‌కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పీపీ, కోర్టుడ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా సోమ వారం ప్రధానన్యాయమూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడడంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీ సర్ ఇన్స్‌పెక్టర్‌లు కృష్ణకుమార్, కిషోర్, రమ ణమూర్తి, సీఎంఎస్ ఎస్సైశ్రీకాంత్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆదిత్య(ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలకేంద్రంలో ఇంటర్ విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. బోయిన్‌పల్లికి చెందిన పిట్టల మల్లేశం కుమారుడు ఆదిత్య(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి పండుగకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన ఆదిత్య సెలవులు ముగిశాక హాస్ట ల్‌కు వెళ్లలేదు. కుటుంబసభ్యులు హాస్టల్‌కు వెళ్లాలని ప్రాధేయపడ్డారు. ఆదిత్య హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సోమవారం ఉదయం గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుప త్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. తండ్రి మల్లేశం ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మనోజ్(ఫైల్)

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ రోడ్డుకు చెందిన దామ మనోజ్(28) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. దామమనోజ్ అనేయువకుడు తన స్నేహితు డైన పుప్పాల మహేష్‌తో ద్విచక్ర వాహనంపై ఐబీ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తుండగా అదుపు డీకొట్టి రోడ్డుపై పడిపోయారు. అదే సమ యంలో అటుగావస్తున్న లారీ దామ మనోజ్‌పై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మహేష్ స్వల్పగాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా మనోజ్‌కు సోమవారం వివాహ విషయమై అమ్మాయి తరపు వారితో మాట్లాడాల్సి ఉండగా అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మనోజ్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీవిద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన వేములవాడ అక్షయ్‌సాయి(18) అనేయువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తనస్నేహితుడిని తీసుకరావడానికి హుజూరా బాద్ నుంచి రంగాపూర్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జమ్మికుంట రోడ్‌లోని గెలాక్సీ సూపర్‌మార్కెట్ వద్ద మున్సిపల్ ట్రాక్టర్ డివైడర్లలో మట్టిని పోయడానికి ఆపాడు. ఈ క్రమంలో అక్షయ్‌సాయి ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాలువలో పడి ఒకరి మృతి

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట శివారులోని కల్వర్టు కింద ఉన్న కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నబోనాల గ్రామానికి చెందిన గోస్కుల పరశురాములు (42) ఆదివారం కోన రావుపేట మండల కేంద్రంలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్కపేట గ్రామ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికాడు. పోలీసులు అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని బస్సు ఎక్కించి పంపించారు. మల్కపేట శివారులో బస్సు దిగి కింద పడుతూ వెళ్లాడు. మల్కపేటలో ఉన్న తల్లి కనకవ్వ కుటుంబ సభ్యులు రాజు ఎంతకు ఇంటికి తిరిగిరాకపోవడంతో సోమవారం ఉదయం వెతుకు తుండగా మల్కపేట శివారులోని బ్రిడ్జికింద ఉన్న కాలువలో పడి మృతిచెందినట్లు గుర్తించారు. ఈవిషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి తల్లికనకవ్వ మల్కపేటశివారులోని బ్రిడ్జికాలువలోపడి మృతి చెందాడా?, ఇంకేమన్నా కారణాలు ఉన్నాయా అనే విషయంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాంచంద్రాపూర్‌లో చోరీ

● నాలుగు తులాల బంగారం అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఉపేంద్ర చారి

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామంలో పట్ట పగలు చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల-సిద్దిపేట ప్రధానరహదారి పక్కన ఇట్టి రెడ్డి రాజిరెడ్డి ఇంట్లో సోమవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటితాళం పగల గొట్టి బీరువాలో ఉన్న 4తులాల బంగారం ఎత్తుకె ళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్‌ఐ ఉపేంద్ర చారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- ఇబ్బందులు పడుతున్న డీలర్లు, లబ్ధిదారులు


ఇబ్రహీంపట్నం మండలంలోని రేషన్‌దుకాణంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యం సంచులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పలు రేషన్‌దుకాణాల్లో దొడ్డుబియ్యం ముక్కిపోతున్నాయి. ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పథకం ప్రారంభించిన నేపథ్యంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అయితే మార్చి నెలలో అందజేసిన దొడ్డు బియ్యం కొన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులు తీసు కోకపోవడంతో మిగిలిపోయాయి. మండలం లోని 22రేషన్ దుకాణాల్లో సుమారుగా 80క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. అయితే మిగిలిపోయిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు వాపసు తీసు కోకపోవడంతో రేషన్‌దుకాణాల్లో ముక్కి పోతున్నాయి. బియ్యం సంచులకు పురు గులు పట్టి అవి కాస్త ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సంచులకు సోకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

● టెండర్లు పిలుస్తాం..

- వరప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం



రేషన్ దుకాణాల్లో మిగిలిపో యిన బియ్యానికి ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సదరు బియ్యానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకువెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిరేషన్ దుకాణాల్లో మిగిలి పోయిన దొడ్డు బియ్యానికి ఈ వారంలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గూడ హరికృష్ణ డిసెంబరు 14, 2023లో ఇంటికి తాళంవేసి తనసొంత గ్రామం బొమ్మకల్‌కి వెళ్లాడు. డిసెంబరు 19, 2023న హరికృష్ణ పనిమనిషి ఇంటిని శుభ్రం చేద్దామని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే యజమానికి విషయం తెలపగా, హరికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో రూ.52వేలు దొంగలించారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపరి చారు. హుజూరాబాద్ కోర్టు కానిస్టేబుల్ మహ్మద్ యూసుఫ్ కోర్టులో సాక్షులను ప్రాసిక్యూషన్ తరుపున పీపీ రమాఉపేందర్ కేసును వాదించగా, జడ్జీ పద్మసాయిశ్రీ సోమవారం నిందితుడికి ఒక సంవత్సరం 8 నెలల శిక్ష విధించారు.

హుజూరాబాద్‌లో కొండచిలువ కలకలం


రోడ్డుపై నుంచి వెళ్తున్న కొండచిలువ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరా బాద్ పట్టణంలో సోమవారం రాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని లక్కీ వైన్స్‌వద్ద కొండచిలువ రహ దారి మీదకు వచ్చింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కొండచిలువను పక్కనేఉన్న అటవీప్రాంతంలో వదిలి పెట్టారు.

కొండ చిలువను చంపిన కోతులు..

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో కోతులు అన్ని కలిసి ఓ కొండ చిలువను చంపేసి వాటి ఐక్యమత్యాన్ని చాటాయి. సోమవారం గ్రామానికి చెందిన చొప్పరి రవి ఇంటి పరిసరాల్లోకి కొండచిలువ వచ్చింది. సుమారు అది ఏడు అడుగుల పొడవు ఉంది. చెట్టుపై ఉన్న ఓ కోతిపిల్లను పట్టుకుని మెల్లమెల్లగా మింగింది. ఈ క్రమంలో చుట్టు పక్కల ఉన్న కోతుల గుంపు దానిని బెదిరిస్తున్నా కొండ చిలువ కోతిపిల్లను వదలకుండా పూర్తిగా మింగే సింది. దీంతో ఆవేశంలో ఉన్న కోతులన్నీ కలిసి ఆ కొండ చిలువను కొరికి చంపే శాయి.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


బూరారం(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బావు పేటలో రాజస్థాన్ లోని నాగోర్ జిల్లా బర్నెల్‌కు చెందిన బూరారం(32) అనే కూలీ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్త పల్లి సీఐ బిల్లకోటేశ్వర్ తెలిపారు. బూరారం సాయిశంకర్ గ్రానైట్స్ కటింగ్‌ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నాడని, కుటుంబ కల హాలతో అద్దెకు ఉంటున్న రేకులషెడ్డులో ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. టేకేదార్ హీరాలాల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు


రాజన్న ఆలయంలోని ఫ్లైఓవర్‌ను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయఅభివృద్ధి, విస్తరణపనులు ఊపందుకు న్నాయి. ప్రధాన ఆలయంలోని భక్తులు శ్రీస్వామి వారి దర్శనం కోసం వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ క్యూలైన్‌లను సోమవారం తొలగించారు. ఉత్తరద్వారం వైపు నల్లాలసమీపంలో ప్రాకారం తొలగించడంతో ఎక్స్‌కవే టర్ ఆలయంలోకి ప్రవేశించింది. దీంతో క్యూలైన్‌లను మిషన్ సహాయంతో వేగంగా తొలగించారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం విని యోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోనును కనుగొని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన బాధితుడు నిమ్మల నరేశ్‌కు సోమవారం అప్పగించామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. నరేశ్ గ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోయిందని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బ్లూకోర్టు కానిస్టేబుల్ సాయి విహార్, హోంగార్డు శంకర్ సెల్‌ఫోను లోకేషన్‌ను పసిగట్టి బాధితుడు నరే శ్‌కు అప్పగించామని పేర్కొన్నారు. సెల్‌ఫోనును గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ సాయివిహార్, హోంగార్డు శంకర్‌లను ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి అభినందించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలకు అధికారయంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కరీంనగర్ కేంద్ర శాఖ కలిగిన అర్బన్ బ్యాంక్‌కు జగిత్యాల, గంగాధరలో రెండు బ్రాంచ్‌లు ఉండగా, ఇటీవల గంగాధర బ్రాంచ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత ఎన్నికల్లో కరీంనగర్, జగిత్యాల సభ్యులకే ఓటు హక్కు లభించింది. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,282మంది ఓటర్లకు కరీంనగర్‌లో 7వేలు, జగిత్యాలలో 2వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 1న నిర్వహించే పాలకవర్గ ఎన్నికల్లో కరీంనగర్ ఓటర్ల కోసం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 24 పోలింగ్ కేంద్రాలు, జగిత్యాల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్ నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 1న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరిగే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ల కోసం క్యూలైన్లతోపాటు మంచినీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారీబందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేములవాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హన్మాజిపేట గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై వెంకట్రాజం సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల210 నగదుతోపాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం హెచ్చరించారు.

పరిహారం అందేనా?



- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న గంగాధర మండల రైతులు
- మార్కెట్ విలువ మేరకు పరిహారం అందించాలని నిర్వాసితుల డిమాండ్
- ఇప్పటికి ఆరు గ్రామ సభలు
- ఎటూ తేల్చని అధికారులు

గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల రైతులు నాలుగు ప్రాజెక్టులకు తమ జీవనాధారమైన భూములను ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్తపల్లి, మనోహరబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి 2004లో ప్రతిపాదనలు పంపించారు. కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పరమల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల్లో భూమిని సేకరించారు. మూడేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన ఇతర గ్రామాల రైతులకు పరిహారం అందించారు. గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పరమల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల రైతులకు పరిహారం అందలేదు. భూమిలిచ్చి ఎనిమిదేళ్లు గడిచినా రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పరిహారం అందించాలని వేడుకున్నా కనీస స్పందన కరువైంది. అధికారులు వచ్చి గ్రామంలో సభలు పెట్టి వెళ్లిపోతున్నారు. కాని పరిహారం విషయం తేల్చడం లేదు. నాలుగేళ్లుగా ఆరు గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పటికీ పరిహారం అందించలేదు.



అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాయి

● నాలుగు ప్రాజెక్టులకు భూములు

మండలంలోని రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు తమ విలువైన భూములను నాలుగు ప్రాజెక్టులకు అప్పగించారు. వరద కాలువ, డీ4 డిస్ట్రిబ్యూటరీ కెనాల్, 1.1 టీఎంసీ కాలువ, కొత్తపల్లి మనోహరబాద్ రైల్వే లైనుకు భూములిచ్చారు. నాలుగు గ్రామాల్లో 50.19 ఎకరాల వ్యవసాయ భూములు, రంగరావుపల్లిలో 23, కాసారంలో 5 ఇళ్లు రైల్వే లైనులో పోతున్నాయి. భూములు కోల్పోతున్న రైతులు తమకు పరిహారం వస్తుందని ఇతర ప్రాంతాల్లో భూములు కొనేందుకు అడ్వాన్స్ ఇచ్చారు. మరి కొందరు అప్పులు తెచ్చి వేరే ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో తమపై అప్పుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

జీవనాధారమైన భూమి పోతుంది

- ద్యావ లింగారెడ్డి, రైతు, రంగరావుపల్లి



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైను నిర్మాణంలో ఐదు ఎకరాల భభూమి పోతుంది. ఆ భూమే నా కుటుంబానికి జీవనాధారం. రెండు కరెంటు బావుల్లో ఒకటి పోతుంది. ఉన్నదాంట్లో భూమి, బావి మధ్య నుంచి లైను పోతుంది. రైల్వే లైను వేస్తే పైపు లైన్ వెయ్యరాదు. ఉన్న బావి నీరు వారుకోవడానికి వీలు ఉండదు. ఈ బావికి కూడా పరిహారం అందిస్తే మరో బాయి తవ్వించుకుంటా. అధికారులు రైతులను బాధపెట్టవద్దు.

నాలుగు ప్రాజెక్టులకు భూమి ఇచ్చా

- సందవేని అయిలయ్య, రైతు, రంగరావుపల్లి



గ్రామంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టులకు నా భూమి ఇచ్చా. వరద కాలువ, డీ4, 1.1 టీఎంసీ, రైల్వే లైనులో ఐదు ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి, ఎనిమిది గుంటల ఇంటి స్థలం, ఇల్లు పోయింది. సర్కారు ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నా. డబ్బులు ఇస్తే వేరే ప్రాంతంలో భూమి తీసుకని ఇల్లు కట్టుకుందామనుకుంటున్న. పరిహారం ఎప్పుడిస్తరో చెప్పడం లేదు.

త్వరగా నష్టపరిహారం చెల్లించాలి

- ద్యావ మధుసూదన్‌రెడ్డి, రంగరావుపల్లి



గ్రామంలో రైల్వే లైనుతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. నా ఇల్లు కోల్పోతున్నాను. అధికారులు త్వరగా నష్టపరిహారం అందించాలి.

స్వదేశం చేరుకున్న గల్ఫ్ బాధితుడు



ఎయిర్‌పోర్టులో గౌరయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి రెండు నెలలుగా ఇబ్బందులు పడ్డ తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని గౌరయ్య సోమవారం స్వదేశానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గౌరయ్యకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులను చూడగానే గౌరయ్య భావోద్వేగానికి గురయ్యాడు. తను రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని ప్రస్తావిస్తూ తను స్వదేశానికి రావడానికి కృషి చేసిన కేటీఆర్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వాహనం ఏర్పాటు చేసి గౌరయ్యను బస్వాపూర్‌లో తన ఇంటికి చేర్చారు.

దుర్శేడ్ పాఠశాలలో చోరీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు ఆటవస్తువులు చోరీకి ఎత్తుకెళ్లారు. 5వ తరగతి గదిలో ఉన్న బీరువా పగలగొట్టి పిల్లలకు సంబంధించిన పుస్తకాలను చిందర వందర చేశారు. కొన్ని ఆటవస్తువులను దొంగిలించుకు పోయారు. పాఠశాల ప్రాంగణంలో నూనె పార బోశారు. పరిశీలించిన ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్న సాహిత్య

- ఖేలో ఇండియా మహిళల విభాగంలో గోల్డ్‌మెడల్
- జాతీయ స్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

మంథనిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఉదరి సాహిత్య జిల్లా, రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రాణిస్తోంది. ఇటీవల నిర్వహించిన ఖేలోఇండియా అండర్-14 సైక్లింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి పలు విభాగాలలో ఛాంపియన్‌గా నిలిచింది. వచ్చేనెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. గుంజపడుగుకు చెందిన ఉదరి శ్రీనివాస్, సంధ్య దంపతుల చిన్నకూతురు సాహిత్య 5వ తరగతి చదువుతోంది. శ్రీనివాస్ దంపతులు కొన్నేళ్ళుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రితో కలిసి ఉదయం గ్రౌండ్‌కు వాకింగ్ వెళ్లగా అక్కడ కొందరు చిన్నారులు సైక్లింగ్ శిక్షణ తీసుకుంటున్నారు. సైక్లింగ్‌పై సాహిత్య ఆసక్తి చూపడంతో శిక్షణ ప్రారంభమైంది. అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు హైదరాబాద్‌కు చెందిన కోచ్ డాక్టర్ మాక్స్వెల్ ట్రివోర్ శిక్షణ ఇస్తున్నాడు. అతని శిక్షణలో సాహిత్య వివిధ విభాగాలలో స్కూల్ గేమ్స్‌లలో మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించింది. సీఎం కప్‌లో సిల్వర్ మెడల్, రాజీవ్ స్పోర్ట్స్ అకాడమి నిర్వహించిన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. నవంబరు 1, 2వ తేదీలలో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. సైక్లింగ్ శిక్షణకు ఒక్క సైకిల్ విలువ రెండు లక్షల వరకు ఉంటుందని, ప్రత్యేక గ్రౌండ్ అవసరం ఉంటుందన్నారు. సాహిత్యలో ఉన్న ప్రతిభను గుర్తించి కోచ్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు.



సాహిత్య



సాహిత్య సాధించిన మెడల్స్

ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అల్గునూరు వెలిచాల జగపతి రావు మెమోరియల్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఏ డివిజన్ వన్డేలీగ్‌కం నాకౌట్ క్రికెట్‌టోర్నీలో బడ్డింగ్ స్టార్స్ జట్టు కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుపై 16పరుగులు తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బడ్డింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 45ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 277పరుగులు చేసింది. ఈ జట్టు నుంచి జయరాం కశ్యప్ 121, అలంకృత్ అగర్వాల్ 52 పరుగులు తీశారు. కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు నుంచి అఫ్రాజ్ గోరు 43 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కంబైన్డ్ డిస్ట్రిక్ట్‌జట్టు నిర్ణీతఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 261పరుగులు చేసి ఓటమి పాలైంది. జట్టునుంచి గణేష్ 74పరుగులు, డేవిడ్ కృపాలరాయి 43పరుగులు, జీఎస్‌కే రెడ్డి 50 పరుగులు సాధించారు. బడ్డింగ్ స్టార్స్‌జట్టు నుంచి ఉదయ్ కిరణ్ మూడు వికెట్లు తీసుకొని రాణించారు. ఈమ్యాచ్ నిర్వహణలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎంపైర్స్‌తోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, సభ్యులు మహేందర్‌గౌడ్, ఉపేందర్‌రావు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



121 పరుగులు సాధించిన జయరాం కశ్యప్



క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న బడ్డింగ్ స్టార్స్, కంబైన్డ్ డిస్ట్రిక్ట్ క్రీడాకారులు

శంభో.. శంకరా..

- భీమన్న ఆలయానికి కార్తీక సోమవారం రద్దీ
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో రమాదేవి



భక్తులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్న భీమేశ్వర ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రంలో భక్తులు హర హర మహాదేవా.. శంభో శంకర.. నామ స్మరణతో భీమన్న ఆలయం మారుమోగింది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా పనులు జరుగుతుండటంతో భక్తులు భీమన్న ఆలయానికి సోమవారం పోటెత్తారు. కార్తీక సోమవారంను పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ, ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. నటరాజు విగ్రహం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైల వద్ద భక్తులు బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు భీమేశ్వర పాహిమాం అంటూ మొక్కులు చెల్లించుకుని వేడుకున్నారు. శ్రీస్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అభిషేకాలు, గండదీపంలో నూనె పోస్తూ గండాలు తొలగి పోవాలని వేడుకున్నారు. నూతనంగా నిర్మించిన షెడ్లలో చండీహోమం, సత్యనారాణ వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాగా అన్నదాన సత్రంపై అంతస్తులో ఏర్పాటుచేసిన నిత్యకళ్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అంతే కాకుండా కార్తీక సోమవారం సందర్భంగా శ్రీస్వామి వారితో పాటుగా అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఆలయ అర్చకులు వైదికంగా చేపట్టారు.

భీమన్న ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో..

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా రాజన్న, భీమన్న ఆలయాలకు భక్తుల పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్న ఆలయ ఈవో రమాదేవి ఆలయంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని ఉద్యోగులను ఈవో ఆదేశించారు.

భీమేశ్వర ఆలయంలో భక్తుల మొక్కులు..

వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భీమన్న ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 4వేల 21మంది కోడెమొక్కులు, 48అభిషేక పూజలు, 11అన్నపూజలు, 89 నిత్య కళ్యాణ పూజలు, 2చండీహోమం, 11 సత్యనారాయణ వ్రతాలు, 6కుంకుమపూజలు ఒక్కటి లింగార్చన, మూడు వాహనపూజలు, 21 పెద్దసేవల, పల్లకిసేవల టికెట్‌లు భక్తులు తీసుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం గోదావరిమాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీసోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు.



కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

అంజన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిదిలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన ర్చకులు రఘు, ఆలయ సిబ్బంది అశోక్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



కొండగట్టులో దీపాలు వెలిగించిన భక్తులు

క్రికెట్ పోటీల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ పోటీల్లో సుల్తానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్14,17 బాలబాలికల విభాగంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 17ఏళ్ల విభాగంలో వైష్ణవి, సాత్విక, అండర్ 14లో దిశాంత్‌లు ప్రతిభ చూపి, ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం దివాకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు సోమవారం అభినందించారు.



క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి

- భక్తుల రద్దీ
- ప్రత్యేక పూజలు

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వస్వామి, శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం నిర్వహించగా భక్తులు బిల్వార్చన చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది సేవలు అందించారు.



ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

● గోదావరి హారతి..

కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురివద్ద సోమవారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ విశేష పూజలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు.

● రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

సుల్తానాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి సోమ వారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా శివాలయాల్లో తెల్లవారుజామునే అభిషేకాలు, పూజలు, దీపదానాల చేశారు. అనంతరం పండితులకు వివిధ రకాల దానాలు సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథనిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రామగిరి మండలం రాజాపూర్, లద్నాపూర్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎక్లాస్‌పూర్ ఏఈ శ్రీధర్ సోమవారం తెలి పారు. విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన వంగడాలతో అధిక దిగుబడి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్

ఎలిగేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వంగడాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ అన్నారు. సుల్తాన్‌పూర్‌లో సోమవారం సత్యనారాయణరావు అనే రైతు నూతన వంగడం దాన్ 75 రకం సాగు చేశాడు. ఈ సందర్భంగా పిలకలు, గొలుసులు, గింజ బరువును పరిశీలించి సూచనలు చేశారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, వరి కోతలను నిలిపి వేయాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ తాలు, రాళ్లను తీసేసి ధాన్యం తీసుకురావాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఏఈవో గణేష్ పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



అవార్డు అందుకుంటున్న తిరుమలరావు

సుల్తానాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్, నర్సయ్యపల్లికి చెందిన జూపల్లి తిరుమలరావుకు రియాలిటి ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమి, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందజేశారు. తమిళనాడులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సేవారంగంలో చేస్తున్న కృషి చేస్తున్నట్లు, మానవ హక్కుల పరిరక్షణ, అంబేద్కర్ ఆశయ సాధన కోసం పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అదనపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

సుల్తానాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కదంబాపూర్‌లో అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు కోరారు. సోమవారం సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 2,300 ఎకరాలకుపైగా వరి సాగు చేస్తున్నారని, మార్కెటింగ్ సరిగా లేదని తెలిపారు. గ్రామంలో మరో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించామన్నారు. రైతులు కడారి సునీల్, గోస్కుల రాజయ్య, తొంటి బీరయ్య, కడారి సునీల్, పెద్ది సదయ్య, కర్రె గట్టయ్య, మీస సంతోష్, గోస్కుల తిరుపతి, జగ్గయ్య కొమురయ్య, ఐలయ్య అప్పల శ్రీను, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అధికారులు

ఓదెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ముఖ హాజరులో పొత్కపల్లి హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతం అధికంగా కనబరిచిన వారికి ప్రభుత్వం పురస్కారం అందజేస్తుంది. హైదరాబాద్‌లో ఉపాధ్యాయుడికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఎఫ్ఆర్ఎస్ జిల్లాను ఎంపిక చేసి పొత్కపల్లి హైస్కూల్‌ను గుర్తించడంపై ఎంఈవో రమేష్ హర్షం వ్యక్తం చేశారు. అదనపు రాష్ట్ర ప్రాజెక్టు అధికారి రాధారెడ్డి, డైరెక్టర్ రమేష్, ఆర్‌జేడీలు సత్యనారాయణ, విజయలక్ష్మి, డీఈవో మాధవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి సామగ్రి పంపిణీ

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంథని మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సామగ్రిని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న సోమవారం పంపిణీ చేశారు. మంథని, మల్హర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాలకు కాంటాలు, మ్యాచర్ మిషన్లు, టార్పాలిన్లు, ప్యాడి క్లినర్స్‌ను అందజేశారు.

డీట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డీట్ వేదికను నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత తెలిపారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంచాలకులు నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు, ఉద్యోగార్థులకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టు పరిశీలన



ఓదెలలో కల్వర్టును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఓదెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జుననగర్ (ఒర్రెగడ్డ) ప్రధాన రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. లారీలు వెళ్లడంతో కల్వర్టు దెబ్బతిన్నదని, వాహనాల రాకపోకలకు తాత్కాలిక రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విమర్శించే వారికి మా పనితీరు, అభివృద్ధే జవాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి విమర్శించే వారికి మా పనితీరు, అభివృద్ధే జవాబు అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగుండం అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తున్నామన్నారు. కార్పొరేషన్‌లో రూ.676 కోట్లతో పనులు జరుగుతున్నాయని, అదనంగా మరో రూ.50కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పాలకుర్తి లిఫ్ట్‌కు సంబంధించి ఫైనాన్స్ అనుమతి లభించిందన్నారు. పలు రహదారుల నిర్మాణం జరుగనున్నదన్నారు. పెద్దంపేట, కుందనపల్లిల్లో ఆర్‌ఓబీలు, రామగుండం ఫైఓవర్ లైట్ ఆర్చ్ నిర్మాణం జరుగుతుందన్నారు. బీపవర్‌హౌస్ స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వ సింగరేణి భూములు కబ్జా చేస్తే స్వాధీనం చేసుకుంటామని, దీనిలో భాగంగానే ఓల్డ్ అశోక థియేటర్, పోచమ్మ మైదానం వంటివి జరిగాయని, ఇందులో వెనక్కి తగ్గేది లేదన్నారు. తాము చేస్తున్న అభివృద్ధిని 2లక్షల మంది ప్రజలు స్వాగతిస్తుంటే కొందరు చిల్లర విమర్శలు చేస్తున్నారన్నారు. అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ బహిరంగ చర్చకు సిద్ధమని, తమ పార్టీ నాయకులు చర్చకు వస్తారన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులు ముందుకు వస్తే న్యాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, ముస్తాఫా, సుజాత, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం జూనియర్ కళాశాల నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థుల మెరుగైన విద్యతో ఆధునిక సౌకర్యాలతో కూడిన కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిన చేపడతామన్నారు.

మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం పొట్యాల, మద్దిర్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మద్దతుతో కూడిన ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఎలాంటి కోతలు, కట్టింగ్‌లు లేకుండా రైస్ మిల్లుల వరకు ధాన్యం సరఫరా చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను నిండా ముంచి దోపిడికి గురి చేసిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గద్దం తిరుపతి, నాయకులు తిరుపతిగౌడ్, ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, ఎండీ ఆసిఫ్, పరుపాటి తిరుపతి, పరుపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులేవీ!

(5వ పేజీ తరువాయి)

నిధులు సీడీపీ నిధులకు అదనమని భావించారు. కానీ కేటాయింపులు లేకపోవడంతో నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. ఏడాది న్నర కాలంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. దీంతో చిన్న చిన్న పనులకు నిధులు లేని పరిస్థితి ఏర్పడింది. భారమంతా ఎమ్మెల్యేల పైనే పడింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ, ప్రతీ చిన్న పనికి కూడా ప్రజలు ఎమ్మెల్యేల వద్దకే వస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం సీడీపీ కింద నిధులు కేటాయించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్సీలకు కూడా నిధులు రావడం లేదు. గతేడాది కేటాయించిన ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు రాక కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా సీడీపీ నిధులు కేటాయించక పోవడంతో ఆ పథకం అమల్లో ఉందా, లేదా అనే చర్చ జరుగుతున్నది.

రిజర్వేషన్లు రాజకీయ పార్టీల భిక్ష కాదు



మాట్లాడుతున్న బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష

పెద్దపల్లి టైన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు రాజకీయ పార్టీలు ఇచ్చే భిక్ష కాదని, బీసీల జనాబా, ఓట్ల బలం ఆధారంగా చట్టంలో మార్పు చేసి రాజ్యాంగబద్ధంగానే వాటాను కేటాయించాలని జిల్లా బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌కే గార్డెన్‌లో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు జిల్లా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారం, రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా జిల్లా బీసీ జేఏసీ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వమే కేటాయించాలన్నారు. అసెంబ్లీలో చేసిన 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం 50 శాతం పరిమితి కారణంగా హైకోర్టులో స్టేకు గురైందని తెలిపారు. గతంలో బంద్‌కు లభించిన మద్దతును ప్రస్తావిస్తూ భవిష్యత్తులో ఈ ఉద్యమానికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అగ్రవర్ణాల్లోని పేదల మద్దతు కావాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో లక్ష్యం నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గుడ్ల సమ్మయ్య, చంద సతీష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఎండి అబ్దుల్ జావిద్, బంధం రామ్మూర్తి, మహంత కష్ణ యాదవ్, లైసెట్టి బిక్షపతి, సంజయ్, బండ నిఖిల్ కుమార్ యాదవ్, బొల్లం భూమేష్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హమాలీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని, తాడు మామూలు ఇవ్వాలని, ఈ అంశాలపై జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేప ట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుకు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాయకులు గంగయ్య, సత్తయ్య, తిరుపతి, శంకర య్య, రాజవెల్లి, సత్తయ్య, తిరుపతి, కనకయ్య, నం బయ్య, గట్టయ్య శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ సెక్షన్ ప్రారంభించిన ఎంఈవో

ధర్మారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్య విద్యార్థుల జీవితాల్లో పునాది లాంటిదని మండల విద్యాధికారి పి.ప్రభాకర్ అన్నారు. సోమవారం చింతలపల్లి పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య, వారిని పాఠశాలకు రప్పించేలా చేస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్‌పీ శ్రీలత, ఇన్‌స్ట్రక్టర్ ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అరెస్ట్ అప్రజాస్వామికం

ధర్మారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అరెస్ట్ అప్రజాస్వామికమని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిపై మంత్రి అడ్లూరి సవాలు స్వీకరిస్తు అంబేద్కర్ విగ్రహ సాక్షిగా చర్చ పెడితే పోలీసులను అడ్డుపెట్టుకొని కొప్పుల ఈశ్వర్‌ను అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారి కెరీర్ లక్ష్యాలను నిర్ణయించుకొని అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే విజయాలు సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్‌జై కిషన్‌ఓజా, రీటెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో సుర్గోని రోహిత్ అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం, రీటెక్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థి కలల ఉద్యోగం వైపు మార్గదర్శనంపై కెరీర్ అవగాహన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ టెక్నిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై మార్గదర్శనం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించి ఉద్యోగ విజయ దిశగా తీసుకెళ్లడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాంబశివరావు, వి.అంజనేయులు, అధ్యాపకులు ఎం.నరేష్, అజయ్‌కుమార్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఓదెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం డీఆర్‌డీవో కాళిందిని పరిశీలించారు. కొలనూర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతూ, వర్షాలు వచ్చే సూచన ఉన్నందున తేమశాతం తగ్గిన ధాన్యాన్ని త్వరగా పంపించాలని, తూకం వేసిన బస్తాలను నిల్వ చేయవద్దన్నారు. కేంద్రాల్లో క్రమ పద్ధతి పాటించాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారి కోరారు. అలాగే కేంద్రాలకు ధాన్యం రాగానే వెంటనే పేర్లను రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ కేంద్రానికి మిల్లులను కేటాయించలేదని, కేంద్రానికి అధిక ధాన్యం వస్తుందని తెలిపారు. మారెళ్ళ శ్రీనివాస్, విజయ, సత్యవతి పాల్గొన్నారు.

మంత్రి మెప్పుకోసమే పుట్ట మధుపై ఆరోపణలు

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అంటేనే అబద్ధాలకు కేరాఫ్ అని జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి-రాకేష్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. మంత్రి చాంబర్‌లో జరిగిన కుంభకోణాన్ని బయట పెడుతూ మధు మాట్లాడిన తీరుపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడినవి అబద్ధాలన్నారు. ఈ వ్యవహారం పై ఓఎస్‌డీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. గోదావరిఖని చౌరస్తాలో ఆధారాలతో తాము వస్తామని, మీరు వస్తారా అని ప్రశ్నించారు. మేడిగడ్డ గోదావరినది జలాలతో సెక్రెటరియేట్‌ను శుద్ధి చేస్తామన్నారు. జక్కు రాకేష్, తగరం శంకర్‌లాల్, కనవేన శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, బుద్దార్తి రాజీ, కాయితీ సమ్మయ్య, సత్తయ్యలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను మార్చండి

కళ్యాణ్‌నగర్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అడ్డుకామని న్యూ ఇండియా పార్టీ నాయకులు జేవీ రాజు, వేముల అశోక్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇనుప స్తంభాలను 40 అడుగులు వేయడంతో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెళుతున్నాయని, రోడ్డు మధ్య నుంచి స్తంభాలను వేయాలని లేదా అండర్ గ్రౌండ్ కేబుల్ కనెక్టివిటీ చేయాలని కోరారు. భవనాలకు స్తంభాలకు మధ్య దూరం ఉండేలా చూడాలని లేకపోతే హై ఓల్టేజీతో ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భవిత, ములుగు వెంకటేష్, జనగామ లక్ష్మీనారాయణ, శంకర్, తిరుపతిరెడ్డి, పటేల్, తిరుపతి పాల్గొన్నారు.

కూలిన ఆసుపత్రి ప్రహరీ, పగిలిన పైపులైన్

ముత్తారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముత్తారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పనులు చేపడుతున్న గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణానికి తవ్వకాలు చేపట్టే క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ కూలిపోయింది. దీంతోపాటు 3, 4వ వార్డులకు మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి సరఫరా చేసే పైపులైన్ ధ్వంసంతో కాలనీవాసులు నీటి అవస్థలు పడుతున్నారు. గుత్తేదారు తీరుపై మాజీ వైస్‌ఎంపీపీ సుదాటి రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తులకు రూ.రెండు కోట్లు

- దక్కింది ఒక్క షాపు

సుల్తానాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వైన్‌షాపుల డ్రాను సోమవారం నిర్వహించారు. సుల్తానాబాద్ మండలంలో ఏడు, పట్టణంలో ఐదు షాపులు ఉన్నాయి. షాపులను దక్కించుకోవడానికి సుల్తానాబాద్‌కు చెందిన మద్యం వ్యాపారుల బృందం గ్రూపుగా ఏర్పడి 60 దరఖాస్తులను సమర్పించింది. ఫీజు రూపేణా దాదాపు రెండు కోట్ల రూపాయలు చెల్లించారు. డ్రాలో వారికి కేవలం ఒకే షాపు దక్కింది. మరో గ్రూపు వారు 15 దరఖాస్తులు చేసుకోగా వారికి ఒక్కషాపు మాత్రమే దక్కింది. సుల్తానాబాద్ సమీప గ్రామానికి చెందిన ఒక మద్యం వ్యాపారి గ్రూపు ద్వారా 35 షాపులకు దరఖాస్తులు వేయించగా ఒకే షాపు దక్కింది. ఎక్కువ షాపులు వస్తాయని ఆశించిన వ్యాపారులకు నిరాశే ఎదురైంది.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను, ల్యాబ్‌లను డీఎంహెచ్‌వో శ్రీవాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్లు, టారిఫ్ బోర్డుల ప్రదర్శన, ఇతర నిబంధనలను పరిశీలించారు. మంథనిలో రెండు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేనట్లు గుర్తించామని, ఒక ఆసుపత్రి అడ్రస్ మారిందని, వారికి నోటీస్ ఇచ్చామన్నారు. పీవో డాక్టర్ శ్రీరాములు, వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మి, భవానీ, డీఎంఎం అధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

ధర్మారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా కమ్మరిఖాన్‌పేటకు చెందిన ఇరుగురాల మహేష్, కో-కన్వీనర్‌గా కొత్తూర్‌కు చెందిన నెరవట్ల అభిలాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల ఇంచార్జ్‌గా మద్దునాల మల్లేష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నుకున్న ఎమ్మార్పీఎస్ సభ్యులను జిల్లా ఇంచార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ అభినందించారు.



ఆర్జీ-2లో కంపెనీ స్థాయి పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో ఈనెల 28, 29 తేదీల్లో కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. అబ్దుల్ కలాం స్టేడియంలో జరిగే పోటీలకు సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, మందమర్రి జట్టు, శ్రీరాంపూర్ జట్టు, ఆర్జీ-1,2 ఏరియాలు కలిపి ఒక జట్టు, ఆర్జీ-2, భూపాలపల్లి జట్టు, మణుగూరు, ఇల్లందు ఒక జట్టు, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలు ఒక జట్టుగా పాల్గొననున్నట్లు అరవిందరావు తెలిపారు.


డిపార్ట్‌మెంట్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రామగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో సోమవారం వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్‌మెంట్ స్థాయి క్రికెట్ పోటీలను పర్యావరణ అధికారి రాజారెడ్డి ప్రారంభించారు. ఉత్తమ నైపుణ్యాతను కనబరిచి కోల్‌ఇండియా స్థాయిలో సింగరేణికి గుర్తింపు తీసుకుని రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు గంగాధర్, శర్వాన్, అధికారులు సునీల్‌ప్రసాద్, కార్యదర్శి సాయిస్వరూప్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య క్రీడాకారులు పాల్గొన్నారు.

మోడల్ ప్లాంటేషన్‌ను ప్రారంభించిన డైరెక్టర్(పీపీ)

గోదావరిఖని, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు ఆర్‌జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఆధ్వర్యంలో ఆగ్రో ఫారెస్ట్ మోడల్ ప్లాంటేషన్‌ను సోమవారం రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్, జీడీకే 1, 3 ఇంక్లైన్ సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు తీసే క్రమంలో భాగంగా కొంత పర్యావరణ విధ్వంసం జరుగుతుంటుందని, దానికి ప్రత్యామ్నాయంగా విరివిగా మొక్కలు నాటుతున్నామన్నారు. అదేవిధంగా బొగ్గును రవాణా చేసే క్రమంలో సీహెచ్‌పీల వద్ద, బొగ్గును రవాణా చేసే రోడ్ల వెంబడి దుమ్ము ధూళి ఎక్కువగా వస్తుందని అట్టి ప్రాంతాలలో ఎక్కువ శ్రద్ధతో హైడెన్సిటీ ప్లాంటేషన్, గ్రీన్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, రమేష్, డీజీఎం బానోత్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అశోక్ రావు, వర ప్రసాద్, బ్రహ్మాజీ రావు, లక్ష్మీరాజు, హన్మంతరావు, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజాయితీగా ఉంటూ అవినీతిని అడ్డుకోవాలి



విజిలెన్స్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ-2లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ, సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ నిజాయితీగా ఉండడంతోపాటు అవినీతి, అక్రమాలు జరిగితే ఎదుర్కోవాలని, విజిలెన్స్ అనేది ఒక సమిష్టి బాధ్యత అని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బీ వెంకన్న పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం విజిలెన్స్ అవగాహన సమావేశంలో ప్రసంగించారు. సింగరేణిలో అన్ని విభాగాలు, పారదర్శకంగా అవినీతి రహితంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఉద్యోగులు, అధికారులతో కలిసి పౌరుల సత్య నిష్ఠ ప్రతిజ్ఞ చేయించారు. జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్), మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్, జీఎం(ఈఅండ్ఎం) విశ్వనాథరాజు, జీఎం (సివిల్) వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో...

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా యేటా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సింగరేణిలో అవినీతికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ నిజాయితీతో పనులు చేయాలని తెలిపారు. పర్సనల్ ఆఫీసర్ హనుమంతరావు ప్రతిజ్ఞ చేయించారు.

జీడీకే 1, 2, 2ఏ, 11 ఇంక్లైన్, సీఎచ్‌పీ, ఏరియా హాస్పి టల్, అన్ని డిపార్ట్‌మెంట్‌లలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఎస్ఓ టూ జీఎం చంద్రశేఖర్, ఏజంట్ చిలుక శ్రీనివాస్, ఏరియా రక్షణఅధికారి సాయి ప్రసా ద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అధికారుల ప్రతినిధి శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ ప్రతినిధి రాజు, పాల్గొన్నారు.

ఆర్జీ-2లో విజిలెన్స్ వారోత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జీఎం బండి వెంకటయ్య ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. నవంబరు 2వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జీఎం తెలిపారు. బొగ్గు రవాణా, వెహికల్ ట్రాకింగ్ సిస్టం, విడిభాగాలు, వస్తువుల కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం లేకుండా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు జీఎం అన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి అవినీతిరహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జీఎం సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, అధికారులు ధనుంజయ, చంద్రశేఖర్, వేణుగోపాల్, వంశీధర్, సాధన్, ఎస్ఎస్ఓ షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో

రామగిరి, (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సింగరేణిలో అవినీతిని పారద్రోలడంతో పాటు ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించడానికి విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేశామన్నారు. గుర్తింపు సంఘం నాయకుడు ఎంఆర్‌సిరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సిహెచ్. వెంకటరమణ, అధికారులు శేఖర్‌బాబు, బండి రామ్మోహన్, సత్యనారాయణ, రాజేంద్రకుమార్, రాజారెడ్డి, మురళీకృష్ణ, ఐలయ్య, పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన గుర్తింపు సంఘం నాయకులు

గోదావరిఖని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్‌లకు ఉద్యోగ ఆర్డర్లు త్వరలో ఇస్తామని సీఎండీ బలరాం నాయక్ తెలిపారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీకి వివిధ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ తెలిపారని ఆయన పేర్కొన్నారు. వీకే కోల్‌మైన్‌ను పర్మినెంట్ కార్మికులతో నడపాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్లందు ఏరియాలోని జేకేఓసీని విస్తరణ చేస్తామని, గోలేటి ఓసీని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800మెగావాట్లతో విద్యుత్ ప్లాంట్‌ను త్వరలోనే శంకుస్థాపనకు చేస్తామని సీఎండీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రంగయ్య, వైవీరావు, ఎల్లాగౌడ్, నాయకులు రంగు శ్రీను ఉన్నారు.